క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో కై లాసనాథస్వామి సన్నిధానం అయ్యప్పస్వాములంతా(అయ్యప్పస్వామి మాలలు ధరించిన వారు) శుక్రవారం మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేరళ వాయిద్యకారుల వాయిద్యాల ప్రదర్శన నడుమ కలశాలలతో స్వాములు ఊరేగింపుగా కల్యాణ మండపం చేరుకుని, అంబులం పూజ, మహాయజ్ఞం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

జూదరుల అరెస్ట్

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్ సమీపంలో ఉన్న మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై జి. కళాధర్ మాట్లాడుతూ.. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 5,350 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

వీరఘట్టం: నిబంధనలకు విరుద్ధంగా 13 మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఎస్.సింహాచలం అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెల్టుషాపులు నిర్వహించినా, మద్యం విక్రయాలు చేపట్టినా చర్యలు తప్పవన్నారు.

చెల్లుబాటులో రూ. పది నాణేలు

వీరఘట్టం: పది రూపాయల నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని స్థానిక యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రధాన్ సూచించారు. స్థానిక మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది రూపాయల నాణేలను తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు కూడా ఈ విషయమై కండక్టర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఉపాధి పనులకు ఆమోదం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్

భామిని: గ్రామ అవసరాలకు.. వ్యవసాయ రంగానికి సహకరించే విధంగా గుర్తించిన ఉపాధి హామీ పనులను ప్రజాప్రతినిధులు ఆమోదించారు. మండలంలోని బాలేరులో ఉపాధి ఏపీఓ తులసీదాస్, టీఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, తదితరులు గుర్తించిన పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేడిబోయిన జగదీశ్వరరావు, పడాల కొండయ్య, గ్రామ పెద్దలు, రైతులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సీతంపేట: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాలకొండ ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణసాయి అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ మంగవేణి, న్యాయవాదులు మూర శ్యామ్యూల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి



న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

జియ్యమ్మవలస: రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల మృతి చెందిన విద్యార్థి జీవన్‌కుమార్ మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని గిరిజన సంఘ నాయకులు కూరంగి సీతారాం, గోరపాడు సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కొల్లి గంగునాయుడు, తోట జీవన్, గిరిజన సంక్షేమ సంఘ నాయకుడు పాలక రంజిత్ కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు పాఠశాల వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం అందజేయాలని, ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం

పాలకొండ రూరల్: స్థానిక యాలాం కూడలి వద్ద కోదండ రామాలయ నిర్మాణానికి శుక్రవారం తొలి అడుగు పడింది. పల్లా కొండలరావు దంపతులు భూమిపూజ చేపట్టారు. స్థానికుల కోరిక మేరకు ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కొండలరావు చెప్పారు. వేద పండితుడు బంకుపల్లి చిట్టిబాబు నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా స్థానికులతో కలిసి భూమిపూజ చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్రం సమీపంలోని గారమ్మ మందిరం వద్ద మండప నిర్మాణానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ దంపతులు రూ.25 వేలు వితరణగా అందించారు.

ఓ వైపు ఆధ్యాత్మికం... మరో వైపు పర్యాటకం..



సీతంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం



సీతంపేట సమీపంలో ఆడలి వ్యూ పాయింట్

- కార్తీక వన భోజనాల సందడి ప్రారంభం
- పర్యాటక కేంద్రంగా ఏజెన్సీ
- నాగావళి నదీ తీరంలో కార్తీక శోభ

పాలకొండ రూరల్/సీతంపేట: కార్తీకమాసం వచ్చిందంటే ఓ వైపు ఆధ్యాత్మిక పారవశ్యం.. మరోవైపు వనభోజనాల సందడి సర్వ సాధారణం. ఈ నెలలో రానున్న ఆదివారం నుంచి పిక్నిక్‌ల సందడి ప్రారంభంకానుంది. నియోజకవర్గంతో పాటు సమీప మండల, ప్రాంతాల ప్రజలు ఏజెన్సీ అందాలను వీక్షించేందుకు సిద్ధమవుతున్నారు. సుందరమైన పర్యాటక కేంద్రంగా సీతంపేట అభివృద్ధి చెందుతోంది. ఏజెన్సీలో అందమైన తోటలు, ఉద్యానవనాలు, ఎత్తైన పర్వతాలు, కొండల నుంచి జాలువారే జలపాతాలు, ఒంపుసొంపులతో కూడుకున్న కొండల మధ్య రహదారులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు నియోజకవర్గంలో నాగావళి, వంశధార వంటి జీవనదులు.. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం, జగన్నాథుని ఆలయంతో పాటు స్థానిక శివాలయాలు, కోటిపల్లి కొండపై శివ మందిరం, జంపరకోట పరిసరాలతో పాటు సీతంపేటలో గల తిరుమలేశుని ఆలయం ఆధ్యాత్మిక కేంద్రాలుగా, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుత శీతాకాలంలో సూర్యోదయ సమయంలో కురిసే మంచు దుప్పట్లను చీల్చుకుని ఆడలి వద్ద ఆవిష్కృతమయ్యే అందాలు వర్ణనాతీతంగా చెప్పవచ్చు.

మన్యంలో ...

సీతంపేట మండలంలో పర్యాటక, పిక్నిక్ స్పాట్‌లుగా సున్నపుగెడ్డ, ఇసుకగెడ్డ, దోనుబాయి చంద్రమ్మ గుడి, ఎత్తైన ఘాట్ రహదారులు, పొల్ల వ్యూ పాయింట్, మెట్టుగూడ, మల్లెమ్మ జలపాతాలు, ఐటీడీఏ అడ్వంచర్ పార్కు పర్యాటకులకు ఆకట్టుకుంటున్నాయి. పాలకొండ మీదుగా సీతంపేట వెళ్లే క్రమంలో కుశిమి వయా శంబాం మీదుగా ఒంపుసొంపులతో కూడిన రహదారిలో 13 కిలోమీటర్ల ప్రయాణం చేస్తే ఆడలి వ్యూ పాయింట్ చేరుకోవచ్చు. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బసతో పాటు ప్రత్యేక హోటళ్లు అందుబాటులో ఉన్నాయి.

భద్రత ముఖ్యం..



వన భోజనాలు, నదీ స్నానాలకు వెళ్లే వారు అవసరమగు జాగ్రత్తలు పాటించాలి. ఆనందం, పుణ్యంతో పాటు వ్యక్తిగత భద్రతపై కూడా దృష్టి సారించాలి. నదీ స్నానాలు చేసేటప్పుడు అక్కడ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. అపరిచితులు, అనుమానాస్పద సంఘటనలు గుర్తించినా, అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలి.
– మీసాల చంద్రమౌళి, సీఐ పాలకొండ.

నాగావళి నదీ తీరంలో...

పాలకొండ – వీరఘట్టం రహదారిలో ఉన్న మామిడి తోటలు.. సమీప నాగావళి తీరంలో యరకారాయపురం, మంగళాపురం గ్రామాల మధ్య ఉన్న పామాయిల్ తోటలు.. సంకిలి, బొడ్డవలస గ్రామాల నడుమ ఉన్న జీడిమామిడి తోటలు వన భోజనాలకు అనుకూలం. ఓ వైపు నాగావళీ నదీ తీరం.. మరో వైపు అందమైన ఇసుక తిన్నెలు, శివాలయం కనువిందు చేస్తాయి. ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతమైన భామిని మండలంలో వంశధార నదీ పరివాహక ప్రాంతాలతో పాటు పులిహోండా, బంద్రసింగి జలపాతాలు పిక్నిక్‌లకు అనుకూలంగా మారాయి.



కుశిమి రహదారిలో మల్లెమ్మగూడ జలపాతం



పాలకొండ సమీపంలో నాగావళి నదీ తీరం



సీతంపేటకు స్వాగతం చెప్పే బోర్డు

మత రాజకీయాలను తరిమికొట్టాలి

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

పాలకొండ రూరల్: తెలుగు గడ్డ పైనుంచి మత రాజకీయాలను తరిమికొట్టాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.బంగారా్రావు, జిల్లా కమిటీ సభ్యుడు పి.భాస్కరరావు డిమాండ్ చేశారు. పాలకొండ, వీరఘట్టాం మండలాల్లో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘ నాయకుడు శంకరరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటు శక్తులకు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. మారుమూల పల్లెల్లోకి మత రాజకీయాలు చొప్పిస్తున్న బీజేపీకి టీడీపీ, జనసేన వంత పాడుతున్నాయని మండిపడ్డారు. డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించనున్న ప్రజాహక్కుల సభలో ఈ అంశంపై చర్చిస్తామన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రరావు

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీఓ గుండేలా చంద్రరావు అన్నారు. మండలంలోని ఘనసరలో సర్పంచ్ కమలా ఫాల్గుణరావు, కార్యదర్శి జగన్నాథంతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ట్యాంక్‌ల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తసేకరణ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సహాయకుడు బిడ్డిక మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది నియామకమెప్పుడు?

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఆరోగ్య సిబ్బంది నియామకం ఎప్పుడని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండల కేంద్రంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పారపపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థులు తరచూ మృత్యువాత పడుతున్నా ఆరోగ్య సిబ్బందిని నియమించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆరోగ్య సిబ్బంది నియామకాలు చేపడతామన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చేసిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. లెక్కల్లోకి రాని విద్యార్థుల మరణాలు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఔషధ మొక్కలు పెంచాలి



ఔషధ మొక్కల ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ ఔషధ మొక్కలు పెంచాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు సూచించారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో కురుపాం మండలంలోని మొండెంఖల్, ఉరిడి గ్రామ పంచాయతీల పరిధిలోని 55 మంది మహిళా రైతులకు మూలికా వైద్యంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులున్నాయని, వాటిలో ఔషధ మొక్కలు కూడా ఉన్నాయన్నారు. ప్రకృతి లభించే ఎన్నో ఔషధ మొక్కలు ఎన్నో రకాల రోగాలకు ఉపశమనం కలిగించే మందుగా ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం ఔషధ మొక్కల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో మూలికా వైద్య నిపుణుడు టి.శివకేశ్వరరావు, రైన్ ఫారెస్ట్ తిమోటిక్ కో–ఆర్డినేటర్ ఎ.శిరీష, క్లస్టర్ కో–ఆర్డినేటర్ ఎం.మణికుమార్, జట్టు ట్రస్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు తీసుకోం...

- ఎండీఎం వాహనాన్ని అడ్డుకున్న ఆరో వార్డు మహిళలు



వీరఘట్టం గెంబలివీధిలో ఆందోళన చేస్తున్న మహిళలు

వీరఘట్టం: ఈ నెల రేషన్ సరుకులు తీసుకోమని ఆరో వార్డు పరిధిలోని గెంబలివీధి వాసులు స్పష్టం చేశారు. ప్రభుత్వం బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇస్తున్నామని చెబుతుంటే, ఎండీఎం ఆపరేటర్ మాత్రం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. దీంతో శుక్రవారం వాహనాన్ని అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే డీలర్ తనకు ఇవ్వని సరుకులు ఎలా ఇవ్వగలనని ఎండీఎం ఆపరేటర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే డీలర్‌ను పిలిపిస్తే, తాము మాట్లాడతామని మహిళలు పట్టుబట్టారు. విషయం తెలిసిన వెంటనే రేషన్ డీలర్ సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. కందిపప్పు స్టాకు వచ్చిందని, అయితే తన వేలిముద్ర పడకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని చెప్పాడు. ప్రస్తుతం బియ్యం తీసుకుంటే, సోమవారానికి కందిపప్పు ఇస్తామని చెప్పినా మహిళలు శాంతించలేదు. దీంతో ఎండీఎం వాహనంతో డీలర్, ఆపరేటర్ తిరుగుముఖం పట్టారు.

పే స్కేల్ సాధనకు పోరాటం



నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

భామిని: గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్ఏ) పే స్కేల్ అమలుకు ఉద్యమిస్తున్నట్లు వీఆర్ఏల సంఘ రాష్ట్ర కార్యదర్శి బుడుమూరు చిన్నారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీఆర్ఏలు చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థి మృతి ఘటనపై మంత్రి ఆరా



విద్యార్థి మృతి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. ఇటీవల జరిగిన విద్యార్థి మృతి ఘటనపై ఆరాతీశారు. జిల్లాలో ఇటువంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. ఆమె వెంట ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, జయకృష్ణ తదితరులు ఉన్నారు.

గుంతల పూడ్చివేత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతలను శుక్రవారం పూడ్చివేశారు. రోడ్డు మేర పెద్దపెద్ద గుంతలు ఉన్న కారణంగా అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలపై స్పందించిన ఎస్ఐ పి.నారాయణరావు రోడ్డు మరమ్మతులకు ముందుకువచ్చారు. జేసీబీ సాయంతో మట్టితో ధూళికేశ్వరస్వామి ఆలయం దగ్గరి గుంతలను పూడ్చివేయించారు. అలాగే గుమ్మగదబవలస సమీపంలో బ్రిడ్జి వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించారు.

యోగాతో ఆరోగ్యపరిరక్షణ



గలావల్లి పీహెచ్‌సీలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యులు సుశీల, శ్రీనివాసరావు, తదితరులు

బలిజిపేట: భారతీయ వైద్యవిధానం, ఆహారపు అలవాట్లు, యోగా వంటివి చాలా ఉపయోగకరమైనవని పార్వతీపురం మన్యం జిల్లా హాస్పిటల్ వైద్యాధికారిణి సుశీల తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గలావల్లి పీహెచ్‌సీలో ఆశ వర్కర్లకు జాతీయ ఆయుష్‌కమిషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ ద్వారా ఆరోగ్యాన్ని ఏవిధంగా సంరక్షించుకోవచ్చో వివరంగా తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలు, ఆరోగ్య జీవనం కోసం ఎటువంటి సాధనాలు చేయాలి, యోగా, హోమియో వైద్యాల వల్ల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పట్టణంలోని ఉత్తరాముఖ ఆంజనేయస్వామి ఆలయ పరిధిలోని శివ సన్నిధానంలో శుక్రవారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు త్రినాథ, రాంబాబు ఆధ్వర్యంలో అర్చకులు విశ్వనాథం, దాస్, తదితరులు పూజ చేపట్టారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. –పాలకొండ

పక్కాగా భూ రీసర్వే



సమగ్ర భూముల రీ సర్వే సక్రమంగా చేపట్టాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో పట్టణ పరిధిలోని భూముల రీ సర్వేపై సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకొండ నగర పంచాయతీ పరిధిలో రీసర్వే వెంటనే ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. దీనిపై సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పూర్తి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సర్వేను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావును ఆదేశించారు. ఆయనతో పాటు డివిజనల్ సర్వేయర్ ఉన్నారు. – పాలకొండ

సీపీఎం ‘ప్రజాపోరు’



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాపోరు పేరిట సీపీఎం ఆందోళన బాట పట్టింది. ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ప్రభుత్వాలు మోసగిస్తున్న తీరుపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు కె.అవినాష్, ఎం.రమణ, కె.గౌరీశ్వరరావులంతా కలిసి గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో పర్యటించి, రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. ఇప్పటికే విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలతో సామాన్యులు ఇక్కట్లు పడుతుంటే అది చాలదన్నట్లుగా కూటమి సర్కారు ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచే దిశగా ఆలోచన చేస్తుండడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టేలా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. –గుమ్మలక్ష్మీపురం

అలరించిన కోలాటం



ఆంధ్రా – ఒడిశా సరిహద్దులోని గుణుపూర్‌లో కార్తీక ఏకాదశి సందర్భంగా నిర్వహిస్తున్న కోటి దీపోత్సవంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు గ్రామాలకు చెందిన మహిళల కోలాట బృందాలు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. – భామిని

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది జోగారావు

గరుగుబిల్లి: మహిళలంతా తమకు రక్షణకు కల్పించే చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని సీనియర్ న్యాయవాది టి.జోగారావు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, బాల్యవివాహాలు, గృహహింస, మహిళలపై అఘాయిత్యాలను వ్యతిరేకించే చట్టాలను వివరించారు. 18 ఏళ్ల వయసు లోపు ఆడపిల్లలకు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని, అటువంటి వివాహాన్ని ప్రోత్సహించిన వారిని కూడా నేరస్తులుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. అలాగే మహిళలను గృహహింసకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలంతా రక్షణ కోసం చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరావు సూచించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2ను ఎంపీడీవో జి.పైడితల్లితో కలిసి శుక్రవారం సందర్శించిన ఆయన.. కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పిల్లల ఆరోగ్యంతో పాటు వారి చదువుపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని వారికి పక్కాగా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌరీశంకరరావు, పంచాయతీ కార్యదర్శి కీర్తి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.